పోషకాలతో పశుసంపద వృద్ధి


షెడ్డులో మేత తింటున్న పాడి ఆవులు


ఆరుబయట పొలాల్లో మేస్తున్న ఆవులు

- మేత విషయంలో పాడి జాగ్రత్త
- సూచనలు పాటించాలంటున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): పోషకాలతోనే పశుసంపద వృద్ధి చెందుతుంది. పశువులకు తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు పదార్థాలు, ఖనిజ లవణాలు, విటమిన్లు, నీరు అవసరముంటాయని పశు సంవర్ధక శాఖాధికారులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు సూచించిన వివరాలు వారి మాటల్లో..

మాంసకృత్తులు

శరీర నిర్మాణానికి, పెరుగుదలకు, రోగ నిరోధక శక్తికి, హిమోగ్లోబిన్ రవాణాకు తోడ్పడతాయి. శరీరానికి శక్తిని సరఫరా చేస్తాయి. పడ్డలు, పెయ్యల ఎదుగుదలకు, పాడిపశువుల్లో పాల దిగుబడికి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు బక్కచిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయాలు చిన్నగా ఉండడం, ఆలస్యంగా యుక్తవయసుకు రావడం, వ్యాధి నిరోధకశక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరిపిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి, మాంసం పొడి వంటి ముడిపదార్థాలు పప్పుజాతికి చెందిన పశుగ్రాసాల్లో సమృద్ధిగా లభిస్తాయి.

పిండిపదార్థాలు

శరీరంలో కొవ్వునిల్వలు అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంసకృత్తులకంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైనది. కొవ్వు, పిండిపదార్థాల కన్నా రెండున్నర రెట్లు అధిక శక్తినిస్తాయి. ఒక గ్రాము కొవ్వుపదార్థం సుమారు 9కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని ప్రసాదిస్తాయి. వేరుశనగపిండి, కొబ్బరిపిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడు లాంటి పదార్థాల్లో కొవ్వుపదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

చిత్తూరు మండలంలో పశుసంపద వివరాలు		
ఆవులు	-	18887
గేదెలు	-	111
గొర్రెలు	-	4103
మేకలు	-	5782

వానాకాలంలో జాగ్రత్తలు

వర్షాకాలంలో గొర్రెలు, మేకల పెంపకం దారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే చిటిక వ్యాధి, నీలి నాలుక వ్యాధి, పారుడు, కాళ్ల డెక్కల వ్యాధి, శ్వాసకోశ వ్యాధి వంటివి సోకే ప్రమాదం ఉంది. గొర్రెలు, మేకలను వర్షం బారి నుంచి రక్షించడం కోసం పాకలు ఏర్పాటు చేసి వాటికి న్యుమోనియా వ్యాధి సోకకుండా కాపాడుకోవాలి. వ్యాధి సోకిన వాటికి సులభంగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి. వ్యాధులు సోకిన గొర్రెలు, మేకలను మందలో కలపకూడదు. అలాగే ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లకూడదు. వ్యాధి నుంచి కోలుకున్న తర్వాత మాత్రమే మందలో కలపాలి. ఒక వేళ గొర్రె లేదా మేక మృతి చెందితే వాటి కళేబరాలను ఊరికి దూరంగా తీసుకెళ్లి లోతుగా గొయ్యి తవ్వి పూడ్చి పెట్టాలి. చనిపోయిన జీవి తినగా మిగిలిన గడ్డిని కూడా కాల్చివేయాలి. నీటి పాత్రలను క్రిమిసంహారక మందులతో శుభ్రం చేసి ఎండలో ఆరబెట్టాలి. అలా జాగ్రత్తలు పాటిస్తే గొర్రెలు, మేకలను కాపాడుకోవచ్చు. మూగజీవాలకు ఏ వ్యాధి సోకినా వెంటనే దగ్గరలో ఉన్న పశువైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయించడంతో పాటు అక్కడి పశువైద్యాధికారి సలహాలు, సూచనలు పాటించాలి.

–ప్రభాకర్, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ

నీరు లేకుండా ఐదు రోజులు

మేత లేకుండా పశువులు మూడు నెలలపాటు బతకగలిగినా నీరు లేకుండా ఐదురోజులకు మించి బతకలేవు. నీరు శరీర జీవన ప్రక్రియకు, ఉత్పాదకతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నీరు ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి, పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాస ప్రక్రియ కొనసాగడానికి, శరీర ద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉండేందుకు చర్మం సాగే గుణం కలిగి ఉండడానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థపదార్థాల విసర్జన క్రియలో దోహదపడుతుంది. శరీరంలోని మాంసపుకృత్తులు, కొవ్వుపదార్థాలు, పిండిపదార్థాల ఆక్సిడేషన్ వల్ల కూడా అరలీటరు నుంచి లీటరు వరకు నీరు ప్రతి పోషకపదార్థం తరపున లభ్యమవుతుంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జింపబడకుండా పశువులు డీహైడ్రేషన్ గురై మరణిస్తాయి. కాబట్టి నీరు కూడా పశువులకు అత్యవసరమయ్యే పోషక పదార్థాల్లో ఒకటిగా గుర్తించాలి. పశువులు తాగేందుకు రోజుకు 50–60 లీటర్ల నీరు అవసరం.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం



గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత నారాయణస్వామిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, బాలాజీనాయుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

వి.కోట: వైఎస్సార్‌సీపీ నేతలకు ఎప్పుడు ఏ అవసరమొచ్చినా అండగా నిలవడంతో పాటు, ప్రజలకు మేలు చేయడంలో ముందుంటానని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మండలంలోని బోయచిన్నాగణపల్లి పంచాయతీ ఎంపీటీసీ నారాయణ స్వామి టీడీపీ శ్రేణుల చేతిలో దెబ్బలు తిని గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి ఆయనకు భరోసానిచ్చారు. వెంకటేగౌడ మాట్లాడుతూ పార్టీ నేతలకు ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటామన్నారు.

గెలుపు సంబరాల ముసుగులో అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేయడం, వైఎస్సార్‌సీపీ నేతలపై భౌతిక దాడులకు పాల్పడడం దారుణమన్నారు. శాంతియుతంగా ఉన్న పలమనేరు నియోజకవర్గంలో ఇలాంటి అల్లర్లు సృష్టిస్తూ, దౌర్జన్యాలకు ఫుల్‌స్టాప్ పెట్టి సమన్వయంగా పని చేసి అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

వైఎస్సార్ సీపీ శ్రేణులెవరూ అధైర్యపడొద్దు

వి.కోట: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని తానెప్పుడూ పార్టీ అభిమానులకు అండగా నిలుస్తానని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ సూచించారు. మండలంలోని తోటకనుమ గ్రామం వెంకటేగౌడ నివాసం వద్ద గల పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మండల పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మనం అధైర్య పడకూడదని, రాబోయే ఎన్నికల్లో తిరిగి మనం అధికారంలోకి వస్తామని భరోసా ఇచ్చారు. ఏ ప్రభుత్వంలోనూ ప్రజలకు జరగని మేలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేశామని, ప్రజల గుండెల్లో మనం స్థానం సాధించామన్నారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని, ఎటువంటి ప్రలోభాలకు భయపడవద్దని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, వైఎస్సార్ అభిమానులు, ముఖ్యనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూరల్ కన్వీనర్‌కు పరామర్శ

పలమనేరు : ఎన్నికల అనంతరం స్వగ్రామానికి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై సీఎంసీలో చికిత్సపొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలమనేరు రూరల్ కన్వీనర్ బాలాజీనాయుడును మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పరామర్శించి ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

జూన్ మాసం.. ఫీజుల భారం

- ప్రైవేట్ స్కూళ్లలో అమాంతం పెరిగిన ఫీజులు
- తల్లిదండ్రులకు ఆర్థిక భారం
- అప్పులు చేసి మరీ చదివిస్తున్న వైనం


మార్కెట్‌లో స్కూల్ బ్యాగుల అమ్మకం అంతా బాదుడే

చిత్తూరు కార్పొరేషన్: చిరుద్యోగి అయిన మోహన్‌కు ఇద్దరు పిల్లలు, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కాన్వెంట్‌లో చదివిస్తున్నాడు. ఒకరు ఐదు, మరొకరు ఏడో తరగతి. వారిద్దరి చదువుకు ఏడాదికి రూ.60 వేల వరకూ ఖర్చవుతుంది. నెలకు రూ.20 వేలు మాత్రమే సంపాదించే మోహన్‌కు పిల్లల చదువు భారంగా మారింది. అయినప్పటికీ ఇంగ్లీషు మీడియం చదువు మాన్పించలేక, ఏటా ఖర్చులు భరించలేక అగచాట్లు పడుతున్నారు. వేసవి సెలవుల అనంతరం జూన్‌లో స్కూళ్ల రీఓపెనింగ్ అంటే విద్యార్థుల తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. కాన్వెంట్ ఫీజు, బస్ ఫీజు, పుస్తకాలు, యూనిఫాం వంటి వాటి కోసం రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. డివిజన్‌లో మొత్తం 128 వరకు ప్రైవేటు స్కూళ్లు ఉండగా అందులో దాదాపు 20 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు.

ప్రైవేటులో వెళ్లాలంటే..

నిత్యావసరాల ధరలు పెరిగిపోయి బతుకు భారమైన ఈ రోజుల్లో తల్లిదండ్రులకు పిల్లల చదువులు అదనపు భారంగా మారాయి. మూడేళ్ల పిల్లోడిని కాన్వెంట్‌లో చేర్పించేందుకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకూ ఖర్చవుతుంది. చిత్తూరు డివిజన్‌లో కార్పొరేట్, ప్రైవేట్ మోత మోగుతోంది. డొనేషన్లు, అడ్మిషన్ ఫీజు, స్కూలు ఫీజు, యూనిఫాం, బూట్లు, పుస్తకాలతోపాటు, బస్ ఫీజులు చెల్లించాలి ఇక కార్పొరేట్ స్కూళ్లలో కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల మోత తప్పడం లేదు. ప్రైవేట్ స్కూళ్లలో ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకూ విద్యార్థుల నోట్ పుస్తకాలు, యూనిఫాం వరకూ అన్నీ రెట్టింపు ధరలే. బస్సు, ఫీజు ఒక్కటే ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.11 వేల నుంచి కలిపి రూ.28 వేల వరకూ ఖర్చవుతోంది. పిల్లల చదువు కొనలేక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. అవసరమైన సబ్జెక్టులు నాలుగే అయినప్పటికీ ఊహ తెలియని పిల్లాడికి కూడా డ్రాయింగ్, జీకే, గ్రామర్, హిందీ, సైన్స్ అంటూ రకరకాల పుస్తకాలు కొనిపిస్తున్నారు. విద్యార్థుల ఫీజులపై ప్రభుత్వం నిర్దిష్ట విధానాన్ని ప్రకటించినప్పటికీ ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు వాటిని పాటించడం లేదు. ప్రైవేట్, టెక్నో స్కూళ్ల మధ్య పోటీ తీవ్రంగా ఉంటోంది. దీంతో ప్రైవేటు బడుల్లో చేరాలని భారీ ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో తమ పిల్లలను ఎక్కడ చదివించాలో అర్థంకాక అయోమయానికి గురవుతున్నారు. చాలా మంది అప్పు చేసి మరీ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లల్లో ఒక్కో విద్యార్థికి అడ్మిషన్ ఫీజు రూ.2 వేలు నుంచి రూ.6 వేలు, జత యూనిఫాంకు రూ.1,200 , పుస్తకాలు, స్టడీ మెటీరియల్, నోట్‌బుక్స్ రూ.2 వేల నుంచి రూ. 6వేల వరకూ వసూలు చేస్తున్నారు. బూట్లకు రూ.300, ఆటో చార్జీ నెలకు రూ.500 నుంచి రూ.1,200, స్టేషనరీ కలిపి రూ.500 మొత్తం రూ.8 వేల నుంచి రూ.10 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని తల్లి దండ్రులు చెబుతున్నారు. కొన్ని కాన్వెంట్లలో బోధించే సిలబస్ ప్రైవేట్ కావడంతో పుస్తకాల బడ్జెట్ మరింత పెరుగుతోంది. ప్రభుత్వం నుంచి పాఠ్య పుస్తకాలు కొనాలన్న నిబంధన ఈ ఏడాది అమలు కావడం లేదు. అదిగాక గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫీజులు ఎల్‌కేజీ స్థాయి కూడా పెరిగాయి. ఈ ఫీజులను ఒకటి లేదా రెండు టర్మ్‌లుగా కాన్వెంట్ల యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. ఖర్చులు ఇంత ఘనంగా ఉన్నప్పటికీ కాన్వెంట్లు, ప్రైవేటు స్కూళ్లలో పూర్తి స్థాయిలో వసతులు ఉంటాయా అంటే ప్రశ్నార్థకమే.


పుస్తకాలు

నిబంధనలు పాటించాలి

ఒకటి నుంచి పదో తరగతి వరకూ ప్రభుత్వం సమకూర్చే పాఠ్య పుస్తకాలనే మాత్రమే కొనుగోలు చేయాలి. అందుకనుగుణంగానే పరీక్షలు నిర్వహించాలి. అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి.

– చంద్రశేఖర్, డీవైఈఓ, చిత్తూరు

‘నేను బడికిపోతా’ను విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో లీలారాణి

పలమనేరు: మండలంలో ఈనెల 13 నుంచి వచ్చే నెల 12 వరకూ నిర్వహించే ‘నేను బడికిపోతా’ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించి విజయవంతం చేద్దామని పలమనేరు ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మార్సీలో ఈ కార్యక్రమంపై శనివారం మండలంలోని హెచ్‌ఎంలు, సీఆర్పీలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బడికెళ్లని బడీడు పిల్లలను గుర్తించి వారిని బడికెళ్లేలా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం నియోజకవర్గ, మండల, పాఠశాల స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్, మండలంలో ఎంపీడీవో, హాస్టల్ వార్డెన్లు, సీడీపీవోలు స్కూల్ చైర్మన్లు, సీఆర్పీలు సభ్యులుగా ఉంటారన్నారు. వీరంతా ఇంటింటికీ వెళ్లి డ్రాపవుట్లను గుర్తించి వారి తల్లిదండ్రులతో చర్చించి వారిని బడికి పంపేలా చూడాలని స్పష్టం చేశారు. ఇందుకోసం సంబంధిత వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది సాయం తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి రోజువారీ డేటాను ఆయా స్కూళ్ల నుంచి ఎమ్మార్సీకి ప్రతిరోజూ 12 గంటలకు పంపాల్సి ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా డ్రాప్ అవుట్స్ ఎక్కువగా ఉన్న టి.వడ్డూరు, దిగువ కల్లాడు, జి, కోటూరు, గంటావూరు, మండిపేటల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎంపీడీవో విద్యాసాగర్, సీడీపీవో ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పట్టని సచివాలయ సిబ్బంది


ఖాళీగా దర్శనమిస్తున్న సిబ్బంది కుర్చీలు

బైరెడ్డిపల్లె : గ్రామ సచివాలయ ఉద్యోగులు రోజూ సమయపాలన పాటిస్తూ విధులకు హాజరై ప్రజల సమస్యలు పరిష్కరించాలి. మండల కేంద్రమైన బైరెడ్డిపల్లె సచివాలయం–1 లో సిబ్బంది సక్రమంగా రావడం లేదని విమర్శలు ఉన్నాయి. శనివారం ఉదయం 11.25 నిమిషాలు అవుతున్నా ఏ ఒక్క ఉద్యోగి కార్యాలయానికి హాజరుకాలేదు. సమస్యల కోసం వచ్చిన ప్రజలు సిబ్బంది ఎవరూ లేక పోవడంతో వెనుదిరిగి వెళ్లారు. 11.35 నిమిషాలకు వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్‌లు హాజరయ్యారు. మిగిలిన శాఖల సిబ్బంది ఎక్కడికి వెళ్లారో అడిగినా సమాచారం లేదు. అధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ సక్రమంగా విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మెడికల్ కాలేజీలను పూర్తి చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పలమనేరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కొత్త మెడికల్ కాలేజీ పనులు త్వరితగతిన పూర్తి చేసి, వాటిని అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం కూటమి సర్కారుపై ఉందని స్థానిక బీజేపీ నాయకులు శరవణ తెలిపారు. ఆమేరకు స్థానిక బీజేపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ కూటమి తరపున బీజేపీ ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రిగా నియమించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అయితే గత సర్కార్ విద్య, వైద్యానికి పెద్దపీట వేసినట్టే ఈ సర్కార్ సైతం ఆస్పత్రుల విషయమై, ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. పలమనేరు ప్రాంతంలో బీ ఫార్మసీ కళాశాలను ఏర్పాటు చేసేందుకు కూటమి సర్కార్ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు ఉమామహేష్, మొగిలీశ్వర్, గేట్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య


మృతి చెందిన సుమిత్ర

పుంగనూరు: పట్టణంలోని తూర్పుపాళెంలో సుమిత్ర(45) అను మానాస్పద స్థితిలో శనివారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. ఒంటరి మహిళగా ఉన్న సుమిత్ర పలువురి వద్ద అప్పులు చేసింది. రుణదాతల వేధింపులతో ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైంది. పురుగుల మందుతాగి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అన్నా క్యాంటీన్‌లో వసతుల కల్పన


అన్నా క్యాంటీన్ వద్ద వసతులు కల్పిస్తున్న సిబ్బంది

పలమనేరు: పట్టణ సమీపంలోని ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అన్నా క్యాంటీన్‌లో అవసరమైన సౌకర్యాలను స్థానిక మున్సిపల్ సిబ్బంది శనివారం చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పర్యవేక్షించారు. గుంటూరు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ పనులను చేపట్టినట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వం త్వరలో అన్నక్యాంటీన్లను ప్రారంభించనున్న నేపథ్యంలో ఇక్కడ మంచినీరు, కరెంట్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని మురకంబట్టులో ఉన్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ భార్గవి తెలిపారు. 5–8వ తరగతి వరకు చదివే మైనారిటీ విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

క్లుప్తంగా

నేటి నుంచి సచివాలయ ఉద్యోగుల క్రికెట్ పోటీలు

పలమనేరు: గంగవరంలోని మదర్ థెరీసా క్రీడామైదానంలో నియోజకవర్గంలోని సచివాలయ ఉద్యోగులకు నేటి నుంచి నాలుగురోజుల పాటు క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్టు ఏపీ సచివాలయాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మురళీనాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ఆసక్తిగల సచివాలయ ఉద్యోగులు పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. గెలుపొందిన జట్టుకు ట్రోఫీని ఇవ్వనున్నట్లు అందులో పేర్కొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పుంగనూరు: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి మహిళ మెడలో బంగారు చైన్ చోరీ జరిగింది. శకుంతలమ్మ దుకాణాన్ని మూసి వేసి ఇంటికి వెళ్తుండగా ద్విచక్ర వాహనంలో హెల్మెట్ ధరించి వచ్చిన వ్యక్తులు వచ్చిన వ్యక్తులు చైన్ లాక్కెళ్లారు. ఆమె కేకలు వేయడంతో ఆ ప్రాంత వాసులు పట్టుకునే ప్రయత్నం చేసినా వారు పరారయ్యారు. బంగారు గొలుసు 30 గ్రాములు ఉంటుందని ఫిర్యాదులో ఆమె పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్షయవ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి


బీసీజీ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: క్షయవ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పొలకలలో శనివారం 60 సంవత్సరాలు గల వృద్ధులకు, 18 సంవత్సరాలు నిండి పొగ తాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులకు బీసీజీ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ బీసీజీ టీకా క్షయవ్యాధి రాకుండా నియంత్రిస్తుందన్నారు. ముందుస్తు చర్యల్లో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు క్షయవ్యాధి నివారణ కోసం బీసీజీ టీకాలు వేస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రామంలో 293 మందికి బీసీజీ టీకాలు వేసినట్లు పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.1.80 లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 18 మంది నిందితులకు రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పు నిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 18 మందిపై కేసు నమోదుచేశారు. శనివారం కోర్టులో హాజరుపరచగా, ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. సీఐ నిత్యబాబు మాట్లాడుతూ గత ఏడు నెలల్లో చిత్తూరులో మద్యం తాగి వాహనాలు నడిపిన 223 మందిపై కేసులు నమోదు చేయగా, న్యాయస్థానం దాదాపు రూ.16 లక్షల జరిమానా విధించిందని తెలిపారు. ఇదే తప్పును రెండోసారి చేస్తే రూ.15 వేల జరిమానా, మూడేళ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశం ఉందన్నారు. వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలను పాటించాలని సూచించారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాత

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీ ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న యాచకులు, 50 మంది పేదలకు శనివారం పార్థసారథినాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత ముత్యాలమ్మ జాతరను పురస్కరించుకుని పూజలు చేశారు. అనంతరం పంపిణీ ప్రారంభించారు.

నిరాశ్రయులకు ఉచిత న్యాయ సేవలు

చిత్తూరు అర్బన్: నిరాశ్రయులకు అండగా ఉంటూ, ఉచిత న్యాయ సేవలు అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వెన్నెల అన్నారు. చిత్తూరు నగరంలోని న్యూ కయనికట్టు వీధిలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహాన్ని న్యాయమూర్తి తనిఖీ చేశారు. అక్కడ నిరాశ్రయులకు అందుతున్న వసతులపై అడిగి తెలుసుకున్నారు. నిరాశ్రయులకు అందుతున్న సేవలపై నిర్వాహకులు జోసెఫ్ రాజుతో మాట్లాడారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ ఇక్కడ ఉన్న నిరాశ్రయులకు వితంతువులకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. ఎవరికైనా ఇబ్బందులు ఉంటే తనను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది ప్రమీల, శ్రీనివాస, శశిరేఖ పాల్గొన్నారు.